## 154 పంచాయతీల్లో..
# వంద శాతం



- నూటికి నూరు శాతం పన్ను చెల్లింపు
- చొరవ చూపిన ప్రత్యేకాధి కారులు, కార్యదర్శులు
- చైతన్యం ప్రదర్శించిన గిరిజన ఆవాసాల జనం
- జిల్లాలో ఇప్పటివరకు 81 శాతం పన్ను వసూలు
- ఇంకా మిగిలింది రెండు రోజులే!

రంగారెడ్డి, మార్చి 28(నమస్తే తెలంగాణ): పన్ను వసూళ్లలో జిల్లాలోని పలు పంచాయతీలు రికార్డు సృష్టించాయి. 154 పంచాయతీలు వందశాతం వసూలుతో ఆదర్శంగా నిలిచాయి. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పాలన ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తవ్వగా.. ఆతర్వాత ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. కొన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తి చేశారు. శతశాతం సాధించిన పంచాయతీల్లో ఎక్కువగా తండాలు ఉండగా.. ఆయా ఆవాసాల ప్రజానీకం పన్నుల చెల్లింపులో పట్టణ వాసులకు స్ఫూర్తిగా నిలిచారు. జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 81 శాతం పన్నులు వసూలయ్యాయి. ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో వందశాతం లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా మిగతా పంచాయతీల అధికారులు పరుగులు పెడుతున్నారు.

### ఆదర్శం ఆ పంచాయతీలు..

ప్రభుత్వం చేపడుతున్న పన్ను వసూలుకు పల్లెవాసులు సైతం మద్దతుగా నిలుస్తున్నారు. గ్రామాభివృద్ధిలో ఇంటి పన్ను కీలకపాత్ర పోషిస్తుండగా.. పన్నులు చెల్లించడం ద్వారా పంచాయతీల అభివృద్ధిలో తమవంతు పాత్రను పోషిస్తున్నారు. గతంలో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటివి అధ్వానంగా ఉండడంతో పన్నులు చెల్లించేందుకు యజమానులు ముందుకు రాకపోయేవారు. కానీ.. గత పదేండ్లల్లో పల్లెల్లో వచ్చిన గణనీయమైన మార్పుతో ఇంటి పన్ను చెల్లించేందుకు చొరవ చూపిస్తున్నారు. పంచాయతీల ఖజానాలో సరిపడా నిధులు ఉన్నప్పుడే కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్న విషయాన్ని ప్రజానీకం గుర్తెరిగి అందుకనుగుణంగా వ్యవహరిస్తున్నది. మరోపక్క పన్ను చెల్లింపులపై అధికారులు అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. దీంతో ఒకప్పటిలా కాకుండా గ్రామాల్లో పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది జిల్లాలో 154 గ్రామ పంచాయతీలు వంద శాతం పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచాయి. ఇందులో అత్యధికంగా మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లోని పంచాయతీలు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియక ముందే వంద శాతం పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరుకున్నాయి.

### మిగిలింది రెండు రోజులే..

'గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో అధికారులు లక్ష్యాన్ని చేరే దిశగా కృషిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 558 గ్రామ పంచాయతీలు ఉండగా 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.32.76కోట్ల ఇంటి పన్ను బకాయిలు ఉన్నాయి. ఆరంభంలో ఇంటి పన్ను ప్రక్రియ వేగవంతంగా సాగినప్పటికీ మధ్యలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పన్ను వసూలుకు బ్రేక్ పడింది. ఎలక్షన్లు ముగిశాక అధికారులు మళ్లీ పన్ను వసూలుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు రూ.26.58 కోట్ల ఇంటి పన్ను వసూలైంది. ఇంకా రూ.6.18కోట్ల బకాయిలను వసూలు చేయాల్సి ఉన్నది. పన్ను చెల్లింపునకు ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో పన్నుల వసూలు ప్రక్రియను సంబంధిత అధికారులు మరింత వేగవంతం చేశారు.

**మండలాలవారీగా వందశాతం లక్ష్యాన్ని చేరుకున్న పంచాయతీలు..**

| మండలం | జీపీల సంఖ్య |
|---|---|
| తలకొండ పల్లి | 19 |
| ఆమనగల్లు | 10 |
| షాబాద్ | 11 |
| నందిగామ | 1 |
| మాడ్గుల | 25 |
| కేశంపేట | 13 |
| చౌదరిగూడెం | 7 |
| కడ్తాల్ | 16 |
| శంషాబాద్ | 5 |
| మొయినాబాద్ | 5 |
| మహేశ్వరం | 8 |
| కొందుర్గు | 8 |
| కందుకూరు | 4 |
| షరూఖ్ నగర్ | 1 |
| చేవెళ్ల | 15 |
| శంకర్‌పల్లి | 3 |
| అబ్దుల్లాపూర్‌మెట్ | 1 |
| కొత్తూరు | 1 |
| మంచాల | 1 |



కొడంగల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి..

# పోలింగ్ 99.86 శాతం..



షాద్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్




ఓటు వేసి సిరా గుర్తును చూపిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న 227 మంది
- కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. షాద్‌నగర్‌లో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శంకర్..
- గెలుపుపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ధీమా
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి తరలిన బ్యాలెట్ బాక్సులు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ తీవ్ర ఉత్కంఠ మధ్య కొనసాగింది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 10 (నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, కొడంగల్, షాద్‌నగర్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 8 చోట్ల 100 శాతం, రెండు చోట్ల 99 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1,439 మంది ఓటర్లగానూ 1,437 మంది వారి ఓటు హక్కు వినియోగించుకోగా 99.86 శాతం పోలింగ్ నమోదైంది.**

షాద్‌నగర్/కొడంగల్, మార్చి 28 : ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నిక పోలింగ్ గురువారం సజావుగా జరిగింది. రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం.. వికారాబాద్ జిల్లా, కొడంగల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 227 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగగా వందశాతం నమోదైంది. కాగా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు సంబంధించి 56 మంది ఓటర్లుండగా మొత్తం సభ్యులు తమ ఓటు హక్కును కొడంగల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సద్వినియోగం చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా వచ్చి ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డితో పాటు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ సుధీర్‌బాబు సందర్శించి పరిశీలించారు. నెల రోజుల పాపతో కలిసి వచ్చి పర్సాపూర్ ఎంపీటీసీ గోవిందమ్మ ఓటు వేయగా, బొంరాస్‌పేట మండలంలోని సుల్తాన్‌పూర్ ఎంపీటీసీ కిష్టమ్మ వృద్ధురాలు కావడంతో వీల్‌చైర్‌లో వెళ్లి ఓటేశారు. అదేవిధంగా షాద్‌నగర్, కల్వకుర్తి సెగ్మెంట్లలోని మున్సిపాలిటీలు, మండలాలకు చెందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు మొత్తం 171 మంది సభ్యులు తమ ఓటు హక్కును మధ్యాహ్నం మూడు గంటల్లోపే వినియోగించుకోవడంతో.. పోలింగ్ 100 శాతం నమోదైనట్లు ఎన్నికల నిర్వహణాధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. బ్యాలెట్ బాక్స్‌లను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరలించారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు ఉంటుందని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో వెంకటమాధవరావు, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి పర్యవేక్షించారు. కాగా పోటీలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు మాత్రమే ఉండడంతో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా క్యాంపులు నిర్వహించగా, కాంగ్రెస్ అభ్యర్థికి సపోర్టుగా ఎమ్మెల్యే శంకర్ క్యాంపు చేపట్టి రాజకీయాన్ని వేడెక్కించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద షాద్‌నగర్ ఏసీపీ రంగ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు, పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



ఓటు వేసేందుకు షాద్‌నగర్ పోలింగ్ కేంద్రానికి వచ్చిన ప్రజాప్రతినిధులు..

## కాంగ్రెస్ పాలనలో..
# అన్నదాతకు కన్నీరు

### భారీగా తగ్గిన భూగర్భ జలాలు.. వట్టిపోతున్న బోర్లు
### ఎండుతున్న వరి పంట..

**జిల్లాలో కరువుఛాయలు అలుముకున్నాయి. తగ్గిన భూగర్భ జలాలతో కండ్ల ముందే వరి పంట ఎండుతుండడంతో అన్నదాతకు కన్నీళ్లు వస్తున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ఎండి పోతుండడంతో అతడి పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.**


**-ఇబ్రహీంపట్నం, / మంచాల/ మొయినాబాద్, మార్చి 28**


ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కరువుఛాయలు అలుముకున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావులు వట్టిపోతున్నాయి. దీంతో వేలాది ఎకరాల వరి పంట ఎండుముఖం పట్టింది. నియోజకవర్గంలోని మంచాల, యాచారం మండలాలు, చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో చేతికొచ్చిన వరి పంట ఎండుతుండడంతో రైతన్నలకు కన్నీళ్లు ఆగడం లేదు. గత యాసంగిలో నియోజకవర్గంలో ఇరవై వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే సగం వరకు బోరుబావులు ఎండిపోయి మోటర్లు కాలిపోతున్నాయి. వాటి కింద సాగు చేసిన వరి పంట సగానికిపైగా ఎండిపోయింది. భూములు నెర్రలు తేలాయి. ముఖ్యంగా నల్గొండ, రంగారెడ్డి జిల్లా సరిహద్దులోని దండుమైలారం, ముకునూరు, తాళ్లపల్లిగూడ, చిత్తాపూర్, తిప్పాయిగూడ, ఆరుట్ల, చెన్నారెడ్డిగూడ, బండాలేమూర్, లోయపల్లి, మంతన్‌గౌరెల్లి, దాత్‌పల్లి, చీదేడు, నల్లవెల్లి తదితర ప్రాంతాల్లో బోరుబావులు వట్టిపోయి వరిపంటపొలాలూ ఎండుముఖం పట్టాయి. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మూసీ పరీవాహక ప్రాంతం మినహా మిగతా ప్రాంతాల్లో పంటపొలాలు ఎండుముఖం పట్టాయి.

### తాగునీటికి కటకట..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఇప్పటికే తాగునీటికి కటకట మొదలైంది. సక్రమంగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీల తోపాటు ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లోని పలు గ్రామాలు, వార్డులకు సరిపడా తాగునీరు సరఫరా కావడంలేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోరుతున్నారు.

మంచాల మండలం ఎల్లమ్మతండాలో ఎండిపోతున్న వరి పొలానికి ట్యాంకర్‌తో నీరు పారిస్తున్న రైతు





మంచాల : ఎండిపోయిన వరి పంటను పశువులకు మేపుతున్న రైతు

### మంచాల మండలంలో..

మంచాల మండలంలో 90 శాతం మేర వరిపంట ఎండిపోయింది. కండ్ల ముందే పంట ఎండిపోతుండడంతో ఎల్లమ్మతండా, బోడకొండ తదితర గ్రామాల్లోని అన్నదాతలు పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. అందుకోసం ట్యాంకర్ల ద్వారా నీటిని పారిస్తున్నారు. దీంతో ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 నుంచి రూ. 2000 వరకు వసూలు చేస్తున్నారు. ఆర్థికంగా స్థోమత లేని రైతులు తమ పంటను పశువులు, గొర్రెలకు మేతగా వదులుతున్నారు. ఏటా యాసంగి సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో 7500 ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేస్తుంటారు. ఈ సారి మాత్రం కేవలం 4000 ఎకరాలే సాగుచేశారు. మండలంలో బోరుబావులు తప్పా కాల్వలు లాంటి మరే ఇతర నీటి వసతిలేదు. మండలంలో గతంలో ఐదువందల అడుగుల లోతుకు బోరు వేస్తే కచ్చితంగా నీళ్లు వచ్చేవి. కానీ.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోయాయి. ఏడు వందల నుంచి వెయ్యి అడుగుల లోతుకు బోర్లు వేస్తున్నా చుక్క నీరు రాక దుమ్మురేగుతున్నది. వ్యవసాయ బావుల కింద రైతులు రెండు, మూడు ఎకరాల్లో వరిని సాగు చేసినా.. ఆ పంట కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడంలేదు. అప్పులు తెచ్చి పంటను సాగు చేస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అర ఎకరమే పారింది..



రెండు ఎకరాల్లో వరి, అర ఎకరంలో వంకాయ పంటను సాగు చేశా. ఈసీ వాగు కూడా దగ్గరగానే ఉండడంతో బోరులోని నీటి ధార తగ్గదని భావించా.. కానీ, గత రెండు రోజులుగా బోరు నుంచి నీరు సరిగ్గా రావడం లేదు. దీంతో పంట ఎండిపోతుందనే భయంతో నీటిని కొనుగోలు చేసి పొలాన్ని తడుపుతున్నా. ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఇప్పటివరకు 19 ట్యాంకర్ల ద్వారా నీటిని పోయిస్తే అర ఎకరం పొలం మాత్రమే పారింది. ఎకరం పొలం పారేందుకు కనీసం 40 ట్యాంకర్లు, రెండెకరాలకు సుమారుగా 80 ట్యాంకర్లు నీళ్లు పోయించాల్సి ఉంటుందని.. అంత మొత్తం ఖర్చు చేసి నీటిని పారించినా వరి పంట చేతికి వస్తుందో లేదోనన్న భయంగా ఉన్నది.

**-గుత్తి యాదయ్య, రైతు, నక్కలపల్లి, మొయినాబాద్**

### పశువుల మేతకూ కష్టమొచ్చింది..



బోరు కింద మూడు ఎకరాల వరకు వరి పంటను సాగు చేశా. ప్రస్తుతం బోరు నుంచి నీటి ధార చాలా వరకు తగ్గింది. మూడు ఎకరాల పంట సాగవుతుందనే నమ్మకం పోయింది. ఇప్పటికే రెండు ఎకరాల్లోని పంట ఎండిపోయింది. ఈసారి పశువుల మేతకు కూడా కష్టమొచ్చింది.

**-సపావట్ మారు(ఎల్లమ్మతండా), రైతు**

### భూమి ఎండి పగుళ్లు వచ్చాయి..



ఎంత కరువొచ్చినా బోరు నుంచి మంచిగానే నీరు వచ్చేది. ఈసారి వానలు కురువలేదు. దీంతో ఉన్న పొలంలో కొంతలో వరిని సాగు చేశా. బోరు నుంచి నీళ్లు రావడంలేదు. పొలం మొత్తం ఎండిపోయి నెర్రలు తేలాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొన్నది.

**-జాటోతు శంకర్‌నాయక్( బోడకొండ), రైతు**

### కేసీఆర్ పాలనలోనే బాగుండే..



కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు సాగు నీళ్లకు కొదువలేదు. వర్షాలు బాగా కురిశాయి. వర్షపు నీటి జాలుతోనే వరి పంటలు పండేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా పంటలకు నీళ్లు లేక పొట్ట దశలోనే ఎండిపోతున్నాయి. గత 15 ఏండ్లుగా ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు. పెట్టిన డబ్బులు కూడా రాని పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**-సేవ్యానాయక్(సలిగుట్టతండా), రైతు**



మంచాల : కాలిపోయిన మోటార్‌ను తీస్తున్న రైతులు

## లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి
### -జిల్లా కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 28(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చునూ లెక్కించాల్సి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇందుకు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్, వీడియో వీవింగ్ బృందాలు సమర్థవంతంగా పని చేయాలని కోరారు. జిల్లాలో ఎన్నికల కోడ్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా ఇప్పటివరకు రూ.79,41,650 నగదు, రూ.4,18,700 విలువైన 5.30 కిలోల సిల్వర్, రూ.37,53,050.5 విలువ గల 5822.53 లీటర్ల మద్యం, రూ. 3,03,25,575 విలువగల 716.925 కిలోల డ్రగ్స్, నార్కోటిక్స్‌ను సీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రూ. 10 లక్షలు పైగా డబ్బు పట్టుబడిన సందర్భంలో ఆదాయ పన్ను శాఖ అధికారులకు తప్పనిసరిగా సమాచారం అందించాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై ప్రతి రోజూ నివేదిక అందించాలన్నారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని ఆబ్కారీ అధికారులకు సూచించారు. గత శాసనసభ ఎన్నికల్లో మాదిరే ఈ ఎన్నికల్లోనూ అధికారులు సమష్టిగా కృషి చేస్తూ అక్రమ డబ్బు, మద్యం, కానుకలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌వో సంగీత, ఎన్ ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.